

కవాతుకు సిద్ధంగా ఉన్న పారా మిలటరీ

పారా మిలటరీ బలగాల కవాతు

లోక్‌సభ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కావడంతో రాష్ట్రవ్యాప్తంగా పోలీసు భద్రత తీవ్రం చేశారు. స్థానిక పోలీసులతో పాటు పారా మిలిటరీ బలగాలు భద్రతా విధులు చేపట్టనున్నాయి. లోక్‌సభ ఎన్నికల భద్రత నిమిత్తం రాష్ట్రానికి 25 కంపెనీల పారా మిలిటరీ బలగాలు చేరుకున్నాయి. స్థానిక కేకేనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పీటీరాజన్ రోడ్డు, రాణి అన్నానగర్ క్వార్టర్స్ తదితర ప్రాంతాల్లో శనివారం ఉదయం 10 గంటలకు పారా మిలిటరీ బలగాలు మార్చ్‌ఫాస్ట్ నిర్వహించాయి. ప్రజలు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా ఓటింగ్‌లో పాల్గొనేందుకు తగిన భద్రత కల్పించనున్నట్లు పోలీసు అధికారులు తెలిపారు.

అమల్లోకి ఎన్నికల కోడ్

- లోక్‌సభ స్థానాలకు ఏప్రిల్ 19న ఎన్నిక
- రాష్ట్రంలో ఒకే విడతలో నిర్వహణ
- అదే రోజు విలవంగోడు అసెంబ్లీ ఉపఎన్నిక కూడా

చెన్నై, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వున్న 39 లోక్‌సభ స్థానాల కోసం ఎన్నికల నగారా మోగింది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. లోక్‌సభ స్థానాలతో పాటు విలవంగోడు అసెంబ్లీ నియోజకవర్గ ఉపఎన్నిక, కేంద్రపాలిత ప్రాంతమైన పుదుచ్చేరి ఎంపీ స్థానానికి ఎన్నికలు జరగనున్నాయి. దీంతో ఒక్కసారిగా తమిళనాట ఎన్నికల వాతావరణం వేడెక్కింది. వచ్చే ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా డీఎంకే, అన్నాడీఎంకే, బీజేపీ కూటములు ఇప్పటికే ముమ్మర ప్రయత్నాలు మొదలుపెట్టిన విషయం తెలిసిందే. డీఎంకే కూటమిలో ఏఏ పార్టీలుంటాయన్నదానిపై ఇప్పటికే స్పష్టత రాగా, అన్నాడీఎంకే, బీజేపీ కూటముల్లో అస్పష్టత కొనసాగుతూనే వుంది.

6 కోట్ల మంది ఓటర్లు...

రాష్ట్రంలో మొత్తం 6.18 కోట్ల మంది ఓటర్లుండగా, ఇందులో 3.14 కోట్ల మంది మహిళలు, 3.03 కోట్ల మంది పురుషులు, 8,200 మంది హిజ్రాలు న్నట్లు ఎన్నికల కమిషన్ ప్రకటించింది. ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఇప్పటికే ఎన్నికల కమిషన్ ఏర్పాట్లు చేపట్టింది. పుదుచ్చేరిలో 10 లక్షల మందికి పైగా ఓటర్లున్నారు. ఇక్కడ డీఎంకే కూటమిలోని కాంగ్రెస్, బీజేపీకి చెందిన అభ్యర్థులు పోటీ పడడం ఖాయమైపోయింది.

తొలి విడతలోనే రాష్ట్రంలో ఎన్నికలు

దేశవ్యాప్తంగా ఏడు విడతలుగా లోక్‌సభ ఎన్నికలు నిర్వహించనున్నట్లు ప్రకటించిన కేంద్ర ఎన్నికల కమిషన్... తొలివిడతగా తమిళనాడులో ఎన్నిక నిర్వహించనున్నట్లు పేర్కొంది. దీంతో రాష్ట్రంలో ఏప్రిల్ 19న ఒకే రోజు విడతలో ఎన్నికలు జరగనున్నాయి. ఈనెల 20 నుంచి 27వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ, 28న నామినేషన్ల పరిశీలన, 30న విత్‌డ్రాకు అవకాశం కల్పించారు. ఏప్రిల్ 19న ఎన్నికలు జరగనుండగా, జూన్ 4న కౌంటింగ్ నిర్వహించనున్నారు. అంటే ఎన్నిక తరువాత ఫలితం కోసం 45 రోజుల పాటు ఎదురు చూడాల్సిన పరిస్థితి.

కూటముల కుంపట్లు

డీఎంకే కూటమిలో కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం, డీపీఐ, ఎండీఎంకే, డీపీఐ, ఇండియన్ యూనియన్ ముస్లింలీగ్, కొంగునాడు మక్కల్ దేశీయ కళగం, మక్కల్ నీదిమయ్యం పార్టీలుండడం ఖాయమైపోయింది. ఆయా పార్టీలకు స్థానాల కేటాయింపు కూడా పూర్తయింది. అయితే అన్నాడీఎంకే, బీజేపీ కూటముల్లో అస్పష్టత కొనసాగుతోంది. గత పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికల్లో పరాజయం పాలై, ఈసారి ఎలాగైనా సత్తా చాటాలన్న కసితో ఉన్న అన్నాడీఎంకే.. తమతో కలిసొచ్చే పార్టీల కోసం తీవ్ర కసరత్తు చేస్తోంది. వన్నియార్ల సామాజికవర్గ బలమున్న పీఎంకే, దివంగత నటుడు విజయకాంత్ స్థాపించిన డీఎండీకేను దరి చేర్చుకునేందుకు ఆ పార్టీ కాసింత తగ్గి మరీ పొత్తుల చర్చలు జరుపుతోంది. అయితే ఈ సారి ఎలాగైనా గణనీయమైన స్థానాలు సాధించాలన్న పట్టుదలతో ముమ్మర ప్రయత్నాలు చేస్తున్న బీజేపీ సైతం.. పీఎంకే, డీఎండీకేలను దరి చేర్చుకునేందుకు గట్టి ప్రయత్నమే చేస్తోంది. రాష్ట్రంలో బలం లేకపోయినా, కేంద్రంలో మళ్లీ తమ పార్టీయే అధికారంలోకి వస్తుందన్న ప్రచారం నేపథ్యంలో ఆ రెండు పార్టీలకు అనూహ్యమైన తాయిలాల ఆశ చూపుతోంది. దీంతో ఏ కూటమిలో చేరాలో అర్థంగాని అయోమయంలో పీఎంకే, డీఎండీకే కొట్టుమిట్టాడుతున్నాయి. అయితే ఇప్పుడు ఎన్నికల నగారా మోగడంతో సాధ్యమైనంత త్వరగా తాము ఎవరితో జత కట్టాలో తేల్చుకునే పనిలో ఆయా పార్టీలో సమాలోచనలు చేస్తున్నాయి.



లోక్‌సభ ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోకి రావటంతో నగరంలో గోడపైనున్న పార్టీ రాతలు కనిపించకుండా పెయింట్ చేస్తున్న కార్మికులు

కోడ్ ఇలా...

పెరంబూర్: లోక్‌సభ ఎన్నికల నోటిఫికేషన్ శనివారం విడుదల కావడంతో, ఎన్నికల నిబంధనలు వెంటనే అమల్లోకి వచ్చాయి. ఆ ప్రకారం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొత్త పథకాలను ప్రకటించేందుకు వీలు లేదు. అలాగే, రాజకీయ నేతల విగ్రహాలను మూసివేయనున్నారు. ఇప్పటికే అమలవుతున్న సంక్షేమ పథకాలకు లబ్ధిదారుల జాబితా విడుదల చేయరాదు. ప్రజల సమస్యలు పరిష్కరించే గ్రీవెన్స్, ప్రారంభోత్సవాలకు అవకాశం లేదు. ప్రభుత్వ కార్యాలయాల్లో ఉన్న దివంగత ముఖ్యమంత్రులు, నేతల చిత్రపటాలు తొలగించాలి. బహిరంగ ప్రాంతాల్లో ఉన్న నేతల విగ్రహాలు మూసివేయడంతో పాటు పార్టీ పతాకాలు, చిహ్నాలు తదితరాలు కూడా కనుమరుగు కానున్నాయి. ఎంపీ, ఎమ్మెల్యేల కార్యాలయాలు మూసివేసి ప్రజాపనుల శాఖకు వాటి తాళాలు అప్పగించనున్నారు. ప్రజా ప్రతినిధులు, వివిధ బోర్డుల అధ్యక్షులు వినియోగించే ప్రభుత్వ వాహనాలను స్వాధీనం చేసుకుంటారు. లైసెన్స్ కలిగిన యజమానులు తమ తుపాకులను సంబంధిత పోలీస్ స్టేషన్లలో సత్వరం అప్పగించాలి. తగిన దస్తావేజులు లేకుండా రూ.50 వేలకు పైబడిన నగదు తీసుకెళ్లరాదు. అలాగే, వ్యక్తిగతంగా రూ.10 లక్షల నగదు బట్వాడా చేయరాదు.

ఎన్నికల తేదీ మోదీకి ముందే తెలుసా? : కాంగ్రెస్

'ప్రధాన మంత్రి నరేంద్రమోదీ దక్షిణ భారతదేశంలో వరుస పర్యటనలు చేస్తుండడం, ఎన్నికల కమిషన్ తొలి విడతగా దక్షిణాదిన ఎన్నికలు నిర్వహించడం చూస్తుంటే ఎన్నికల తేదీ గురించి మోదీకి ముందే తెలుసా?' అంటూ కాంగ్రెస్ అనుమానం వ్యక్తం చేసింది. టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వపెరుందగై మీడియాతో మాట్లాడుతూ... మోదీ ఉత్తరాది పర్యటనలు మానేసి, వరుసగా దక్షిణ భారతదేశంలో ఎందుకు పర్యటిస్తున్నారో ఇప్పుడు అర్థమైందన్నారు. ఎన్నికల కమిషన్ షెడ్యూల్ ఆయనకు ముందే తెలుసని, అందుకే ఆయన తొలివిడతలో ఎన్నిక జరిగే దక్షిణ భారతదేశంలో పర్యటిస్తున్నారని అనుమానం వ్యక్తం చేశారు. ఎన్నికల కమిషన్ షెడ్యూల్ గురించి మోదీకి ముందే ఎలా తెలుసని ప్రశ్నిస్తూ.. అందుకే కొన్ని వ్యవస్థలపై ప్రజలకు నమ్మకం పోయిందని నిట్టూర్పు విడిచారు.



'మీరు క్షేమమా?' కార్యక్రమంలో భాగంగా శనివారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఓ వ్యక్తితో మాట్లాడుతున్న సీఎం స్టాలిన్

వచ్చే యేడాది జూన్‌లో ప్రపంచ ప్రాచీన తమిళ భాష ద్వితీయ మహానాడు

చెన్నైలోనే నిర్వహణ ● సీఎం స్టాలిన్

చెన్నై, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): వచ్చే యేడాది జూన్‌లో రాజధాని నగరం చెన్నైలో ప్రపంచ ప్రాచీన తమిళ భాష ద్వితీయ మహానాడును అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించనున్నట్లు సీఎం స్టాలిన్ ప్రకటించారు. ఐదు రోజులపాటు నిర్వహించే ఆ మహానాడులో దేశవిదేశాలకు చెందిన తమిళ సాహితీవేత్తలు, తమిళ పండితులు, పరిశోధకులు, భాషావేత్తలు తదితర ప్రముఖులందరూ పాల్గొంటారని తెలిపారు. డీఎంకే ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విదేశీ తమిళ సంక్షేమం కోసం ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేసిందని, తమిళ సాహితీవేత్తలు, పండితులన నగదు పురస్కారాలతో సత్కరిస్తున్నామని ఆయన తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న తమిళులందరినీ ఒకే వేదికపైకి తెచ్చేలా యేటా జనవరి 12న విదేశీ తమిళుల దినోత్సవంగా జరుపుకుంటున్నామని, ఈ మేరకు ఈ యేడాది విదేశీ తమిళుల మహానాడు ఘనంగా నిర్వహించామని తెలిపారు. తమిళ మాధ్యమంలో చదివిన విద్యార్థులకు ప్రభుత్వ ఉద్యోగాల్లో ప్రాధాన్యం కల్పించడం, ఆలయాల్లో తమిళంలో అర్చనాది కార్యక్రమాలు నిర్వహించడం, ఇంజనీరింగ్, మెడిసిన్ కోర్సులకు సంబంధించిన ఆంగ్ల పాఠ్యపుస్తకాలను తమిళంలో అనువదించి తమిళంలో ఆ కోర్సులు చదివే సదుపాయం కల్పించడం అంటూ తమిళభాషకు పట్టం గడుతున్న తమ ప్రభుత్వం వచ్చే యేడాది ప్రపంచ ప్రాచీన తమిళ భాషా (సెమ్మొళి తమిళ) మహానాడును ఘనంగా నిర్వహించనున్నామని స్టాలిన్ పేర్కొన్నారు.

అలాంటి మాటలు తగవు

● ప్రధాని మోదీకి మంత్రి దురైమురుగన్ హితవు



వంతెన ప్రారంభిస్తున్న మంత్రి దురైమురుగన్



వేలూరు, మార్చి 16: డీఎంకే, కాంగ్రెస్ కూటమిని నేలకూల్చడమే తన మొదటి లక్ష్యమని మోదీ మాట్లాడారని, ప్రధాని స్థాయికి అలాంటి వ్యాఖ్యలు తగవని నీటిపారుదల శాఖ మంత్రి దురైమురుగన్ హితవు పలికారు. ఎన్నికల బాండ్ల అవినీతిని కప్పిపుచ్చుకొనేందుకు మోదీ నేతృత్వంలో బీజేపీ యంత్రాంగం తంటాలు పడుతోందన్నారు. ఈడీ, ఐటీ దాడులకు ఎన్నికల పత్రాలకు సంబంధం లేదని స్వయంగా కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించడాన్ని బట్టి, బీజేపీ ప్రభుత్వం ఎంతటి అవినీతికి పాల్పడుతుందో అర్థమవుతోందని మంత్రి తెలిపారు. అంతకుముందు మేల్‌పాడి సమీపం పొన్నై నది మధ్య రూ.12.94 కోట్లతో 190 మీటర్ల పొడవున నిర్మించిన వంతెనను శనివారం మంత్రి ప్రారంభించారు. కొన్నేళ్ల క్రితం రూ.3 కోట్లతో నిర్మించిన ఈ వంతెన వరదలకు కొట్టుకుపోవడంతో, రూ.12.94 కోట్లతో పటిష్ఠంగా వంతెన నిర్మించామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సుబ్బులక్ష్మి, కాట్పాడి యూనియన్ కమిటీ అధ్యక్షుడు వేల్‌మురుగన్, ఉపాధ్యక్షుడు శరవణన్, మేల్ పాలారు సూపర్‌వైజింగ్ ఇంజనీర్ రమేష్, ఇంజనీర్ ప్రభాకరన్, తహసీల్దార్ కవిత తదితరులు పాల్గొన్నారు.



రేపే ప్రధాని కోయంబత్తూరు రాక

చెన్నై, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్రమోదీ ఈనెల 18న కోయంబత్తూరు నగరానికి విచ్చేయనున్నారు. బీజేపీ ప్రచార సభలో పాల్గొనే నిమిత్తం ఆయన సాయంత్రం 4.30 గంటలకు కర్ణాటక రాష్ట్రం శివమొగ్గ నుంచి విమానంలో బయలుదేరి సాయంత్రం 5.30 గంటలకు కోయంబత్తూరు అంతర్జాతీయ విమానాశ్రయాన్ని చేరుకుంటారు. అక్కడి నుండి 5.45 గంటలకు కారులో బయలుదేరి మూడు కిలోమీటర్ల దూరం వరకూ రోడ్‌షోలో పాల్గొంటారు. ఆ తర్వాత బహిరంగ సభలో పాల్గొంటారు. సాయంత్రం 6.45 ప్రచార సభ ముగియనుంది. ఆ తర్వాత రాత్రి 7 గంటలకు కోయంబత్తూరు ప్రభుత్వ అతిథిగృహంలో ఆయన బస చేయనున్నారు. ఈనెల 19 ఉదయం 9.30 గంటలకు కారులో బయలుదేరి కోయంబత్తూరు అంతర్జాతీయ విమానాశ్రయం చేరుకుంటారు. అక్కడి నుండి హెలికాప్టర్‌లో కేరళ రాష్ట్రం పాలక్కాడుకు వెళ్లి ఉదయం 11.40 గంటలకు అక్కడ జరిగే బహిరంగ సభలో పాల్గొంటారు. ఆ తర్వాత 1 గంటకు పాలక్కాడు నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి 1.50 గంటలకు సేలం నగరానికి చేరుకుంటారు. సేలంలో బీజేపీ ప్రచార బహిరంగ సభలో పాల్గొంటారు. ఆ తర్వాత మధ్యాహ్నం 2.25 గంటలకు ఆయన విమానంలో ఢిల్లీకి బయలుదేరి వెళతారు.

కపాలేశ్వర ఆలయంలో పంగుని మాసోత్సవాలు ప్రారంభం



ధ్వజారోహణం నిర్వహిస్తున్న ఆలయ ప్రధాన అర్చకులు - వేడుకలో పాల్గొన్న భక్తులు



అడయార్, మార్చి 16: స్థానిక కపాలేశ్వర ఆలయంలో పంగుని మాసోత్సవాలు శనివారం ఉదయం ధ్వజారోహణంతో శాస్త్రోక్తంగా ప్రారంభమయ్యాయి. ఈ వేడుకల్లో వేలాదిమంది భక్తులు పాల్గొని హరహర ధ్వానాలు చేశారు. ఈ ఆలయంలో యేటా పంగుని మాసోత్సవాలను వైభవంగా నిర్వహిస్తుంటారు. ఇందులోభాగంగా ఈ యేడాది ఈ వేడుకలు శనివారం ఉదయం నుంచి ప్రారంభమయ్యాయి. ఈ నెల 27వ తేదీ వరకు వివిధ ఉత్సవాలను నిర్వహిస్తారు. ధ్వజారోహణ కార్యక్రమాన్ని వేద మంత్రాలు, నాదస్వర సంగీతం, భక్తుల శివనామస్మరణ మధ్య పూర్తి చేశారు. ఆ తర్వాత కపాలేశ్వర స్వామి, కర్పగమ్మాళ్, వళ్లీదేవయాని, మురుగపెరుమాళ్‌కు పుష్పాభిషేకం నిర్వహించారు. ఈ వేడుకలు జరిగే పది రోజులు ఐదు తిరుమేణి వీధుల్లో ఉత్సవమూర్తులు ఊరేగుతూ భక్తులకు దర్శన భాగ్యం కల్పిస్తారు. ఈ వేడుకల్లో ముఖ్యమైన రథోత్సవం ఈ నెల 22న జరగనుంది. 23వ తేదీన మధ్యాహ్నం 3.30 గంటలకు అరుపత్తు మూండు నాయన్మార్ల ఊరేగింపు నిర్వహిస్తారు. 25వ తేదీన రాత్రి 7.45 గంటలకు తిరుకల్యాణ వేడుకలు నిర్వహిస్తారు. కాగా, ఈ వేడుకలను పురస్కరించుకుని పది రోజుల పాటు మైలాపూర్ ప్రాంతంలో వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించారు. అలాగే, భక్తులకు సౌకర్యార్థం, తాగునీరు, మొబైల్ టాయిలెట్లు, వైద్య శిబిరాలను కూడా ఏర్పాటు చేశారు. నగర పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు.

రంజాన్ వేళలు

ఆదివారం : ఇఫ్తార్ : సాయంత్రం - 6.27
సోమవారం : సహర్ : ఉదయం - 4.35



అమరజీవి ఆంధ్రుల ఆత్మగౌరవం

ఏఐటీఎఫ్ అధ్యక్షులు ఆచార్య సీఎంకే రెడ్డి ● పొట్టి శ్రీరాములు స్మారక భవనంలో ఘనంగా జయంతి



విజేతలతో డాక్టర్ సీఎంకే రెడ్డి, కె.అనిల్‌కుమార్ రెడ్డి తదితరులు

ప్యారీస్, మార్చి 16: తెలుగు రాష్ట్రం రావాలన్న లక్ష్యం కోసం ప్రాణత్యాగం చేసిన అమరజీవి పొట్టిశ్రీరాములు ఆంధ్రుల ఆత్మగౌరవమని అఖిల భారత తెలుగు సమాఖ్య (ఏఐటీఎఫ్) అధ్యక్షుడు ఆచార్య సీఎంకే రెడ్డి అన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నిర్వహణలో ఉన్న అమరజీవి పొట్టి శ్రీరాములు స్మారక భవన నిర్వాహక కమిటీ ఆధ్వర్యంలో శనివారం ఉదయం అమరజీవి పొట్టిశ్రీరాములు 123వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. గాయని వసుంధరదేవి 'మా తెలుగుతల్లికి...' ప్రార్థనా గీతంతో ప్రారంభమైన ఈ సభలో కమిటీ సభ్యులు డాక్టర్ ఎంవీ నారాయణ గుప్తా స్వాగతం పలకగా పారిశ్రామికవేత్త, కమిటీ అధ్యక్షుడు కాకుటూరి అనిల్‌కుమార్ రెడ్డి సారథ్యం వహించి అధ్యక్ష ఉపన్యాసం చేస్తూ... ప్రపంచంలో ఎంతో మంది త్యాగాలు చేశారని, వారిలో ఎవ్వరికీ దక్కని అరుదైన 'అమరజీవి' అన్న బిరుదు తెలుగు తల్లి ముద్దుబిడ్డ పొట్టి శ్రీరాములునే వరించిందని కీర్తించారు. తెలుగు భాషకు, ఆంధ్రులకు ప్రత్యేక గుర్తింపు తెచ్చిన అమరజీవిని స్మరించుకుంటూ ఎవ్వరూ కార్యక్రమాలు జరుపుకున్నా సహకరిస్తామని తెలిపారు. నిస్వార్థంగా దేశభక్తితో జీవించిన పొట్టి శ్రీరాములు త్యాగనిరతి గురించి భావితరాలకు తెలియజేయాలన్న దృక్పథంతో తమ కమిటీ ఆధ్వర్యంలో ఆయన జయంతి, వర్ధంతి సందర్భంగా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. విద్యార్థులకు అమరజీవి జీవిత చరిత్ర గురించి అవగాహన కల్పించేలా "పొట్టి శ్రీరాములులో మీకు నచ్చిన అంశాలు ఏమిటి" అనే అంశంపై వక్తృత్వ, వ్యాసరచన పోటీలు నిర్వహించగా, ఇందులో నగరంలోని ఎస్‌కేపీడీ, కేటీసీటీ, టి.నగర్ కేసరి, ఎస్కేడీటీ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారని తెలిపారు. అనంతరం ముఖ్యఅతిథి సీఎంకే రెడ్డి, విజేతలకు ప్రశంసాపత్రాలు, నగదు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా సభను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ... తెలుగు సభల్లో నిండుదనం ఉంటేనే పాలకుల్లో ఆంధ్రుల పట్ల స్పందన కలుగుతుందని, మన భావితరాలు భవిష్యత్తులో బాగా బతకాలన్న ఉద్దేశంతో ఏర్పాటుచేసే సభలకు తెలుగువారంతా కలుసుకొని ఐక్యతను చాటుకుందామని పిలుపునిచ్చారు. రాష్ట్ర ఓటర్లలో సుమారు 60 శాతం మంది తెలుగు వారు ఓటు హక్కుల కలిగి ఉన్నారని, అయినా తెలుగు సంఘాల మధ్య ఐక్యత లేనందువల్ల సరైన గుర్తింపు రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాజ్యాంగబద్ధంగా చెందాల్సిన ఉపాధి కల్పన, విద్య ఇతర రాయితీలను పొందేందుకు సమష్టిగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. తెలుగు భాషను కాపాడుకోవడంలో తల్లిదండ్రులు ముందుండి తమ పిల్లలను మాతృభాషలో చదివించాలని, భాష లేకుంటే జాతి లేదని అన్నారు. అనంతరం విశిష్ట అతిథి ప్రముఖ సినీ గేయరచయిత భువనచంద్ర... జీవితం లెక్కతో ముడిపడి ఉందని, భూమ్మీద పడే ప్రతి చినుకు, సూర్యరశ్మికి విలువ ఉన్నట్లే అమరజీవిని ప్రతి సంవత్సరం స్మరించుకోవడం మారని లెక్క అని అభివర్ణించారు. ఆయన ప్రాణత్యాగం వల్లనే ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, బిహార్ తదితర రాష్ట్రాలు ఏర్పడ్డాయని గుర్తు చేశారు. ఆత్మీయ అతిథిగా టి.నగర్ కేసరి మహోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగుల గోపాలయ్య, ఎస్‌కేపీడీ బాలుర మహోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఓరుగంటి లీలారాణి, కేటీసీటీ పాఠశాల తెలుగు ఉపాధ్యాయురాలు రేవతి బాల, రచయిత్రి ఆముక్త మాల్యద తదితరులు పాల్గొన్నారు. వేడుకల ఏర్పాట్లను కమిటీ సంయుక్త కార్యదర్శి ఊరా శశికళ, సభ్యులు గుడిమెట్ల చెన్నయ్య, జేఎం నాయుడు తదితరులు పర్యవేక్షించారు. ఊరా శశికళ వందన సమర్పణతో కార్యక్రమం ముగిసింది.

సమాచార ధ్వని

5న మద్రాస్ వర్సిటీలో ఉగాది ఉత్సవం
కవి సమ్మేళనంలో పాల్గొనేవారికి అవకాశం

చెన్నై, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): మద్రాస్ విశ్వ విద్యాలయం తెలుగుశాఖ ఆధ్వర్యంలో ఏప్రిల్ 5న శ్రీ క్రోధి నామ సంవత్సర ఉగాది ఉత్సవాలు జరగనున్నాయి. మెరీనా ఆవరణలోని రజతోత్సవ ప్రాంగణం లో జరగనున్న ఈ ఉత్సవాల్లో భాగంగా కవి సమ్మేళనం జరగనుంది. ఇందులో పాల్గొనదలచిన ఔత్సాహికులు ఈనెల 25వ తేదీ లోగా తమ పేర్లు నమోదు చేసుకోవాలని తెలుగుశాఖాధిపతి ఆచార్య విస్తాలి శంకరరావు పేర్కొన్నారు. వివరాలకు నెం.9445203041, 9701869674, 72006854774లలో సంప్రదించవచ్చు.

కిలో టమోటా రూ.15

ఐసిఎఫ్, మార్చి 16: దిగుమతులు పెరగడంతో కోయంబేడు మార్కెట్లో కిలో టమోటా రూ.15కు విక్రయమవుతున్నాయి. ధర్మపురి, కృష్ణగిరి వంటి జిల్లాలతో పాటు పొరుగు రాష్ట్రాల నుంచి మార్కెట్‌కు టమోటాలు దిగుమతి అవుతున్నాయి. ఇటీవల రూ.25కు విక్రయమైన టమోటాలు ప్రస్తుతం అధిక దిగుమతుల కారణంగా రూ.15కు వ్యాపారులు విక్రయిస్తున్నారు.

ఉచిత గ్యాస్ కనెక్షన్ 37 లక్షల మందికి లబ్ధి

ఐసిఎఫ్, మార్చి 16: ఉచిత గ్యాస్ కనెక్షన్ పథకం కింద 37 లక్షల మంది లబ్ధి పొందినట్లు అధికారులు తెలిపారు. గ్రామాల్లో నివసించే మహిళల కోసం ప్రధాన మంత్రి ఉజ్వల యోజన పథకాన్ని 2016లో కేంద్ర ప్రభుత్వం ప్రారంభించింది. ఈ పథకంలో రాష్ట్రంలో తొలివిడతగా 32 లక్షల మంది చేరారు. ఈ ఆర్థిక సంవత్సరం నుంచి మరో మూడేళ్ల వరకు కేంద్రం ఈ పథకాన్ని పొడిగించింది. దేశవ్యాప్తంగా అదనంగా 75 లక్షల కనెక్షన్లు ఇచ్చేందుకు కేంద్రం నిర్ణయించింది. ఈ పనులు 2023 అక్టోబరులో ప్రారంభం కాగా, ఆయిల్ సంస్థలు గ్రామాల్లో ఉన్న లబ్ధిదారులను ఎంపిక చేసి గ్యాస్ కనెక్షన్లు ఇచ్చారు. ఇప్పటివరకు ఉచిత గ్యాస్ కనెక్షన్ పథకంలో మొత్తం 37 లక్షల మంది లబ్ధిపొందుతున్నారని అధికారులు తెలిపారు.

100 రోజులు తప్పనిసరిగా తరగతులు

ఐసిఎఫ్, మార్చి 16: బీఎడ్ కళాశాలలు ఒక్కో సెమిస్టర్ పరీక్షకు 100 రోజుల తరగతులు తప్పక నిర్వహించాలని ఉన్నత విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రవ్యాప్తంగా 650 కళాశాలల్లో బీఎడ్, ఎంఎడ్ కోర్సులు నిర్వహిస్తున్నారు. కొన్ని కళాశాలల్లో సక్రమంగా తరగతులు నిర్వహించడం లేదని ఫిర్యాదులందాయి. ఈ నేపథ్యంలో, బీఎడ్ కళాశాలలకు ఉపాధ్యాయ విద్యా విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ రామకృష్ణన్ పంపిన సర్క్యులర్‌లో... జాతీయ విద్యా కౌన్సిల్ ఆదేశాల మేరకు ప్రతి సెమిస్టర్ పరీక్ష జరిగే నాటికి 100 రోజుల వరకు నిర్వహించి ఉండాలని పేర్కొన్నారు. అలాగే, ఈనెల 18వ తేది నుంచి సెమిస్టర్ పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు.

డాక్టర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ఐసిఎఫ్, మార్చి 16: ప్రభుత్వాసుపత్రుల్లో ఖాళీగా ఉన్న 2,553 డాక్టర్ పోస్టులకు ఏప్రిల్ 24వ తేది నుంచి దరఖాస్తు చేసుకోవాలని వైద్య ఉద్యోగుల ఎంపిక బోర్డు (ఎమ్మార్బీ) తెలిపింది. ఈ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్‌ను ఎమ్మార్బీ శుక్రవారం విడుదల చేసింది. దరఖాస్తు రుసుము, వయో పరిమితి, ఆన్‌లైన్ నమోదు విధానం వంటి వివరాలను మెడికల్ రిక్రూట్‌మెంట్ బోర్డు వెబ్‌సైట్‌లో చూడవచ్చు.

ఫోరెన్సిక్ సైన్స్ విభాగంలో ఆరుగురి నియామకం

ఐసిఎఫ్, మార్చి 16: ఫోరెన్సిక్ సైన్స్ విభాగంలో ఆరుగురు నియమితులయ్యారు. టీఎన్‌పీఎస్సీ ద్వారా ఈ విభాగంలోని ఖాళీగా ఉన్న పోస్టులకు 29 మంది ఎంపికయ్యారు. వారిలో ఆరుగురికి ఉద్యోగ నియామక ఉత్తర్వులను అందజేశారు. ఎంపికైన వారు ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్‌ల్లో విధులు నిర్వహించనున్నారని అధికారులు తెలిపారు.

2,700 మిలియన్ లీటర్ల తాగునీటి సరఫరా

ఐసిఎఫ్, మార్చి 16: రాష్ట్రవ్యాప్తంగా ప్రతిరోజు 2,700 మిలియన్ లీటర్ల తాగునీరు సరఫరా చేస్తున్నట్లు రాష్ట్ర తాగునీటి బోర్డు తెలిపింది. ఈ బోర్డు కావేరి, పాలారు, తామ్రభరణి, కొల్లిడం వంటి 500కు పైగా సహకార తాగునీటి పథకాలను అమలు పరుస్తోంది. ప్రతిరోజు 2,100 మిలియన్ లీటర్ల తాగునీరు సరఫరా చేస్తోంది. వేసవి కారణంగా నీటి వినియోగం పెరగడంతో చెన్నై మినహా అన్ని జిల్లాల్లో రోజుకు 2,700 మిలియన్ లీటర్లు సరఫరా చేస్తున్నామని బోర్డు అధికారులు తెలిపారు.

విద్యుత్ స్తంభం, ట్రాన్స్‌ఫార్మర్ల తరలింపు ఛార్జీల తగ్గింపు

ఐసిఎఫ్, మార్చి 16: ప్రజలు తమ స్థలాలు, గృహాల సమీపంలో ఉన్న విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, పిల్లర్ బాక్స్‌లు వంటి వాటిని మరో చోటుకి మార్చేందుకు వసూలు చేసే ఛార్జీలు 22 శాతం నుం చి 5 శాతానికి తగ్గింది. తమ నివాసాల సమీపంలో ఉన్న విద్యుత్ సాధనాలను తరలించేందుకు ప్రజలు విద్యుత్ బోర్డుకు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంది. అందుకయ్యే మొత్తం ఖర్చు విలువకట్టి దరఖాస్తుదారుల నుంచి వసూలు చేస్తున్నారు. ఈ రుసుము తగ్గిస్తూ విద్యుత్ బోర్డు ఉత్తర్వులు జారీ చేసింది.

ఢిల్లీ ఉద్యోగులకు వండలూరులో శిక్షణ

ఐసిఎఫ్, మార్చి 16: ఢిల్లీ జాతీయ పార్కుకు చెందిన 30 మంది వన్యమృగ పర్యవేక్షకులకు వండలూరు జులాజికల్ పార్కు ఆధ్వర్యంలో 15 రోజుల శిక్షణ జరగనుంది. మొదటి రోజు శిక్షణ తరగతులు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఇలాంటి శిక్షణను వండలూరు పార్కు ఇవ్వడం ఇదే తొలిసారి. అటవీ జంతువులను బంధించడం, పర్యవేక్షణ, ఆహారం అందజేసే విధానం వంటి వాటిపై శిక్షణ ఇవ్వనున్నారు. పులికాట్, వేడన్‌తాంగళ్, గిండి పార్కు, స్నేక్ పార్కు వంటి వాటిల్లో కూడా ఢిల్లీ సిబ్బందికి శిక్షణ ఇవ్వనున్నట్లు అధికారులు తెలిపారు.

ఓఎంఆర్ రోడ్డులో ట్రాఫిక్ మార్పులు

ఐసిఎఫ్, మార్చి 16: మెట్రోరైలు పనుల కారణంగా ఓఎంఆర్ రోడ్డులో వారం రోజులు ట్రాఫిక్ మార్పులు అమల్లో ఉంటాయని పోలీసు శాఖ తెలిపింది. వేళచ్చేరి నుంచి వాహనాలు అపోలో జంక్షన్‌లో కుడివైపు తిరిగి దురైపాక్కం, షోళింగనల్లూర్ వెళ్లాలి. అడయార్, తిరువాన్మియూర్ నుంచి వచ్చే వాహనాలు అపోలో జంక్షన్‌లో కుడివైపు తిరిగి వేళచ్చేరి చేరుకోవాలి.

ప్రభుత్వ బస్సుల్లో 60 రోజులకు ముందుగానే రిజర్వేషన్

పెరంబూర్, మార్చి 16: ప్రభుత్వ బస్సుల్లో ఇకపై 60 రోజులకు ముందుగానే రిజర్వేషన్ చేసుకొనే వసతి కల్పించినట్లు రాష్ట్ర ఎక్స్‌ప్రెస్ రవాణా సంస్థ (ఎస్‌ఈటీసీ) తెలిపింది. గతంలో 30 రోజులకు ముందుగా రిజర్వేషన్ చేసుకొనే సమయాన్ని 60 రోజులకు పెంచారు. ఈ సౌకర్యం ఈనెల 15వ తేది నుంచి అందుబాటులోకి వచ్చింది. ఎస్‌ఈటీసీ వెబ్‌సైట్, యాప్, మొబైల్ యాప్‌ల ద్వారా ఈ రిజర్వేషన్ పొందవచ్చు.

అరియలూరు లబ్ధిదారులతో స్టాలిన్ మాటామంతి

● క్యాన్సర్ బాధిత బాలుడికి రూ.లక్ష సాయం



స్టాలిన్ ఉత్తర్వు మేరకు క్యాన్సర్‌తో బాధపడుతున్న బాలుడు మదన్‌రాజ్‌కు లక్ష రూపాయల చెక్కును అందజేస్తున్న అరియలూరు జిల్లా కలెక్టర్ ఆని మేరీ స్వర్ణా

చెన్నై, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు మారుమూల గ్రామాకు చేరుతున్నాయా అని ఆరా తీసే దిశగా 'నీంగళ్ నలమా?' (మీరు కుశలమేనా?) పేరిట ప్రవేశపెట్టిన పథకంలో భాగంగా అరియలూరు జిల్లాకు చెందిన లబ్ధిదారులతో ముఖ్యమంత్రి స్టాలిన్ మాట్లాడారు. శనివారం ఉదయం క్యాంపు కార్యాలయం నుంచి వీడియోకాల్ చేసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తొలుత గోవిందాపురానికి చెందిన గృహిణి రాధికకు కాల్ చేసి కలైంజర్ మహిళా సాధికారిక నగదు రూ.1000 సక్రమంగా అందుతోందా అని ప్రశ్నించారు. రాధిక బదులిస్తూ.. ఆ నగదు అందిందని, దాన్ని క్యాన్సర్‌తో బాధపడుతున్న తన కుమారుడు మదన్‌రాజ్ వైద్య ఖర్చుల కోసం వినియోగిస్తున్నానని తెలిపారు. స్పందిచిన స్టాలిన్ ఆమె కుమారుడి వైద్య చికిత్స కోసం తక్షణమే రూ.లక్షను అందిస్తున్నట్లు ప్రకటించారు. ఆ మేరకు స్టాలిన్ ఆదేశం మేరకు అరియలూరు జిల్లా కలెక్టర్ ఆని మేరిస్వర్ణ... రాధిక ఇంటికే వెళ్లి బాలుడు మదన్‌రాజ్‌కు లక్ష రూపాయల చెక్కును అందజేశారు. అంతే కాకుండా కూలిపనులు చేసుకుంటున్న రాధికకు ఉచితంగా కుట్టు మెషీన్‌ను కూడా అందిస్తామని స్టాలిన్ హామీ ఇచ్చారు. హామీపై రాధిక హర్షం ప్రకటించింది. ఇదే విధంగా అరియలూరు జిల్లాల్లో పలువురు లబ్ధిదారులతో స్టాలిన్ మాట్లాడారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శివదాస్ మీనా, ముదల్వరిన్ ముగవరి (ముఖ్యమంత్రి చిరునామా) ప్రత్యేక పథకం అధికారి డి. మోహన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు స్టాలిన్ ముంబై పయనం

డీఎంకే అధ్యక్షుడు స్టాలిన్ ఆదివారం ఉదయం ముంబైకి బయలుదేరి వెళ్తున్నారు. ఏఐసీసీ మాజీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ ఫిబ్రవరి 14న మణిపూర్‌లో ప్రారంభించిన ఏక్తా యాత్ర ఆదివారం మహారాష్ట్రలోని దాదర్ వద్దనున్న అంబేడ్కర్ స్మారక స్థలం ఉన్న చైత్యభూమి వద్ద ముగియనుంది. ఆ సందర్భంగా శివాజీ పార్కులో ఇండియా కూటమి పార్టీ నేతల సమావేశం జరగనుంది. ఆ సమావేశంలో రాహుల్, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే, స్టాలిన్, సమాజ్‌వాది పార్టీ నాయకుడు అఖిలేష్ యాదవ్, శివసేన నాయకుడు ఉద్ధవ్‌ఠాక్రే, నేషనల్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు శరద్‌పవార్ తదితరులు పాల్గొంటారు.ఆ సమావేశంలో పాల్గొని ప్రసంగించే నిమిత్తం స్టాలిన్ ఆదివారం ఉదయం విమానంలో బయలుదేరి వెళుతున్నారు. ఇండియా కూటమి సమావేశంలో పాల్గొని ప్రసంగించిన తర్వాత ఆదివారం రాత్రి ఆయన చెన్నైకి తిరిగి వస్తారు.

నూతన జాతీయ విద్యా విధానాన్ని అంగీకరించం
● మంత్రి అన్బిల్ మహేశ్

అడయార్, మార్చి 16: కేంద్ర ప్రభుత్వం అమలు చేయనున్న నూతన జాతీయ విద్యా విధానాన్ని అంగీకరించబోమని రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ మంత్రి అన్బిల్ మహేశ్ తన ట్విటర్ ఖాతాలో ట్వీట్ చేశారు. 'పీఎంశ్రీ' అనే విధానాన్ని అమలు చేసే విషయంపై కేంద్రంతో రాష్ట్రం అవగాహన ఒప్పందంపై సంతకం చేసే విషయంపై ప్రభుత్వం ఒక స్పష్టమైన నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. పీఎంశ్రీ ఎన్‌ఈపీ2020 విధానం మోడల్ స్కూళ్లకు మాత్రమేనని తెలిపిందన్నారు. అయితే, కేంద్ర రాష్ట్రాల మధ్య విద్యా విధానంపై జరిగే అవగాహన ఒప్పందం వల్ల సంబంధాలు మరింతగా బలోపేతమవుతాయన్నారు. ఈ పథకం కింద రాష్ట్రంలో 14,500 పాఠశాలలను అభివృద్ధి చేయనున్నట్టు తెలిపారు. అయితే, కొత్త విద్యా విధానాన్ని మాత్రం అమలు చేయబోమని ఆయన వెల్లడించారు.

కలలు కనడం బీజేపీ హక్కు
● ఎంపీ కనిమొళి

అడయార్, మార్చి 16: రాష్ట్రంలో భారతీయ జనతా పార్టీ ఓట్ల శాతం పెరిగినట్టుగా, అధికారంలోకి వస్తున్నట్టుగా కలలు కనడం వారి హక్కు అని తూత్తుక్కుడి ఎంపీ, డీఎంకే సీనియర్ మహిళా నేత కనిమొళి అన్నారు. ఆమె తూత్తుక్కుడిలో విలేకరులతో మాట్లాడుతూ, రాష్ట్రానికి పదేపదే వస్తున్న ప్రధాని మోదీ.. చెన్నై నగరం నీట మునిగినపుడు, నాలుగు దక్షిణాది జిల్లాలు వరద ముంపునకు గురైనపుడు ఏం చేశారని ప్రశ్నించారు. ముఖ్యంగా వైపరీత్యాల వల్ల ఏర్పడిన భారీ నష్టానికి ఇప్పటి వరకు పరిహారం అందించలేదన్నారు. ఉపాధి అవకాశాలు లేక నిరుద్యోగులు ఇబ్బంది పడుతున్నారన్నారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఇదే పరిస్థితి ఉందన్నారు. అయితే ప్రధాని మోదీ రాష్ట్ర పర్యటనల వల్ల బీజేపీ ఓటు బ్యాంకు పెరిగిందని, అధికారంలోకి వస్తామని ఆ పార్టీ మహిళా నేత, ఎమ్మెల్యే వానతి శ్రీనివాసన్ చెబుతున్నారు కదా అని ప్రశ్నించగా, కలలు కనడం బీజేపీ నేతల హక్కు అని కనిమొళి వ్యాఖ్యానించారు.

మైలాడుదురై కోర్టులో బీజేపీ నాయకుడు

అడయార్, మార్చి 16: మైలాడుదురై ఆధీనంను కించపరిచేలా దుష్ప్రచారం చేసిన కేసులో బీజేపీ నాయకుడు అఘోరం శనివారం మైలాడుదురై కోర్టులో హాజరయ్యారు. ఆధీనంను బెదిరించిన వ్యవహారంలో అఘోరంను స్థానిక పోలీసులు శుక్రవారం అరెస్టు చేయగా, శనివారం కోర్టులో హాజరుపరిచారు. కాగా, మదురై ఆధీనంను అవమానించేలా, చెడ్డపేరు తెచ్చేలా ప్రచారం చేస్తున్నారంటూ గత నెల 25వ తేదీన మదురై ఆధీనం మఠం ప్రతినిధులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదును స్వీకరించిన పోలీసులు ఈ కేసులో విఘ్నేష్, వినోద్, కుడియరసు, శ్రీనివాస్‌ను గత నెల 28వ తేదీన అరెస్టు చేశారు. ఇదే కేసులో మైలాడుదురై జిల్లా బీజేపీ నాయకుడు అఘోరం, అధీనం సహాయకుడు సెంథిల్, తిరుక్కడైయూర్ సెంథిల్, చెయ్యారు న్యాయవాది జయచంద్రన్, ఫోటోగ్రాఫర్ ప్రభాకరన్ కోసం గాలిస్తూ వచ్చారు. ఈ నేపథ్యంలో అఘోరంను శుక్రవారం అరెస్టు చేసి, కోర్టులో హాజరుపరిచారు.

ఆరు జిల్లాల్లో కార్చిచ్చు

ఐసిఎఫ్, మార్చి 16: రాష్ట్రంలోని ఆరు జిల్లాల్లో 28 ప్రాంతాల్లో కార్చిచ్చు ఏర్పడినట్లు అటవీ శాఖ అధికారులు తెలిపారు. శుక్రవారం నీలగిరి, దిండుగల్ జిల్లాల్లో తలా 7 ప్రాంతాలు, కృష్ణగిరిలో 6, తిరువణ్ణామలైలో 4, తేని, తిరువళ్లూర్ జిల్లాల్లో తలా రెండు అని మొత్తం 28 ప్రాంతాల్లో కార్చిచ్చు ఏర్పడిందని తెలిపారు.

గంగైకొండాన్ ఆలయంలో శిలాఫలకం లభ్యం

ఐసిఎఫ్, మార్చి 16: తిరునల్వేలి సమీపంలో ఉన్న గంగైకొండాన్ కైలాసనగర్ ఆలయంలో చరిత్ర పరిశోధకులు శిలాఫలకం కనుగొన్నారు. శుక్రవారం తిరునల్వేలి చరిత్ర సంస్కృతి పరిశోధన కేంద్ర డైరెక్టర్ మారియప్పన్ ఇసక్కి నేతృత్వంలో అధ్యాపకుల బృందం ఈ ఆలయంలో పరిశోధనలు చేపట్టింది. పాండ్య రాజుల కాలానికి చెందిన ఓ శిలాఫలకాన్ని గుర్తించారు. పాండ్య రాజు మొదటి మారవర్మన్ సుందర పాండ్యన్ కాలంలో మలిచిందని, ఈ శిలాఫలకం స్థూపాకారంలో ఉందని, అందులో ఉన్న లిపిని అధ్యయనం చేయాల్సి ఉందని పేర్కొన్నారు.

కడపాక్కం జలాశయం పునరుద్ధరణ

ఐసిఎఫ్, మార్చి 16: కడపాక్కం జలాశయ పునరుద్ధరణ పనులు రూ.58.33 కోట్లతో చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు. వర్షాకాలంలో వరదలు ఏర్పడకుండా అడ్డుకొనేలా చెన్నై కార్పొరేషన్ చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా కాలువలు, జలాశయాల్లో పూడికతీత పనులు చేపడుతోంది. ఈ నేపథ్యంలో, కడపాక్కం జలాశయ పునరుద్ధరణ పనులకు ప్రభుత్వం నిధులు కేటాయించిందని, త్వరలో పనులు ప్రారంభిస్తామని అధికారులు తెలిపారు.

నేడు 44 సబర్బన్ రైళ్ల పాక్షిక రద్దు

పెరంబూర్, మార్చి 15: ట్రాక్ మరమ్మతుల కారణంగా ఆదివారం చెన్నై బీచ్ - చెంగల్పట్టు మార్గంలో 44 సబర్బన్ రైలు సేవలు పాక్షికంగా రద్దు చేసినట్లు దక్షిణ రైల్వే తెలిపింది. చెన్నై బీచ్ - తాంబరం మధ్య ఉదయం 1.30 నుంచి మధ్యాహ్నం 3.30 గంటల వరకు పట్టాల మరమ్మతులు జరగనున్నాయి. ఈ కారణంగా చెన్నై బీచ్ నుంచి తాంబరం - చెంగల్పట్టు మధ్య ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 3.15 గంటల వరకు రెండు మార్గాల్లో సబర్బన్ రైళ్లు రద్దు చేసినట్లు పేర్కొంది. మధ్యాహ్నం 3.30 అనంతరం రైళ్లు యధావిధిగా నడుస్తాయని అధికారులు తెలిపారు. అదే సమయంలో తాంబరం - చెంగల్పట్టు మధ్య ప్రయాణికుల సౌకర్యార్థం ఉదయం 11.55, మధ్యాహ్నం 12.45, 1.25, 1.45, 1.55, 2.40, 2.55 గంటలు, చెంగల్పట్టు - తాంబరం మధ్య ఉదయం 9.30, 9.40, 10.55, 11.05, 11.30, మధ్యాహ్నం 12, 1 గంటలకు ప్రత్యేక రైళ్లు నడపనున్నారు. అలాగే, కాంచీపురం - తాంబరం మధ్య ఉదయం 9.30, తిరుమాల్‌పూర్ - తాంబరం మధ్య మధ్యాహ్నం 12 గంటలకు ప్రత్యేక రైళ్లు నడపనున్నట్లు దక్షిణ రైల్వే తెలిపింది.

అదనపు ఎంటీసీ బస్సులు, మెట్రో రైళ్లు... : ఆదివారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 3.15 గంటల వరకు చెన్నై బీచ్ - తాంబరం మధ్య సబర్బన్ రైళ్లు రద్దు కానున్న నేపథ్యంలో ప్రయాణికుల కోసం 150 అదనపు సిటీ బస్సులు నడపనున్నట్లు ఎంటీసీ తెలిపింది. అలాగే, అదనపు మెట్రోరైళ్లు నడపనున్నట్లు చెన్నై మెట్రోరైల్ లిమిటెడ్ తెలిపింది.



తిరుపత్తూర్ జిల్లాలో వసూళ్లకు పాల్పడుతున్న నకిలీ పాత్రికేయులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ జిల్లా కలెక్టర్ దర్పగరాజ్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న జిల్లా పాత్రికేయుల సంఘ నిర్వాహకులు

లోక్‌సభ ఎన్నికల్లో నామ్ తమిళర్ కట్చి తరపున పోటీలో 14 మంది వైద్యులు

పెరంబూర్, మార్చి 16: లోక్‌సభ ఎన్నికల్లో నామ్ తమిళర్ కట్చి తరపున 14 మంది వైద్యులు, ఐదుగురు ఇంజనీర్లు, నలుగురు ప్రొఫెసర్లు పోటీ చేయనున్నట్లు సమాచారం. లోక్‌సభ ఎన్నికల్లో ఆ పార్టీ తమిళనాడు, పుదుచ్చేరిలో 40 స్థానాల్లో ఒంటరిగా పోటీ చేస్తోంది. గతంలో తాము పోటీ చేసిన 'చెరకు గడతో రైతు' గుర్తును కేటాయించాలంటూ ఆ పార్టీ సుప్రీంకోర్టులో దాఖలు చేసిన పిటిషన్ విచారణలో ఉంది. అయినా, ఇప్పటికే పలువురు అభ్యర్థులను ప్రకటించగా, వారు గుర్తు లేకున్నా వీధి వీధినా ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఈ నేపథ్యంలో, పార్టీ తరపున ఉన్నత విద్యావంతులను బరిలోకి దింపాలని భావించిన ఆ పార్టీ, వైద్యులు, ఇంజనీర్లు, ప్రొఫెసర్లను ఎంపిక చేసినట్లు సమాచారం. ఈ నెల 23, 24 తేదీల్లో నగరంలో జరుగనున్న పార్టీ సమావేశంలో పూర్తిస్థాయి అభ్యర్థుల జాబితాను ఆ పార్టీ ఆర్గనైజర్ సీమాన్ విడుదల చేయనున్నారు.

ఎయిడెడ్ పాఠశాలల విద్యార్థినులకు కూడా నెలకు రూ.1,000

పెరంబూర్, మార్చి 16: ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థినులకూ నెలకు రూ.1,000 అందించే 'పుదుమై పెణ్' పథకాన్ని రానున్న విద్యా సంవత్సరం నుంచి అమలు చేయనున్నట్లు ప్రకటించింది. ఈ పథకంలో వచ్చే విద్యా సంవత్సరం నుంచి 49,664 మంది లబ్ధిపొందనున్నారు. ఈ పథకంలో 6 నుంచి 12వ తరగతి వరకు ప్రభుత్వ పాఠశాలల్లో చదివి, రాష్ట్రంలోని ఉన్నత విద్యాసంస్థల్లో చేరే విద్యార్థినులు, ప్రైవేటు పాఠశాలల్లో 6 నుంచి 8వ తరగతి వరకు చదివి అనంతరం 9 నుంచి 12వ తరగతి వరకు ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థినులకు ఈ పథకం కింద నెలకు రూ.1,000 రాష్ట్రప్రభుత్వం అందజేస్తోంది.ఈనేపథ్యంలో,ఈ పథకాన్ని వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఎయిడెడ్ పాఠశాలలకు కూడా విస్తరించనున్నట్లు సాంఘిక సంక్షేమ శాఖ కార్యదర్శి జయశ్రీ మురళీధరన్ జీవో విడుదల చేశారు.

రూ.147 కోట్లతో ఆసుపత్రి భవనాలు

ఐసిఎఫ్, మార్చి 16: స్థానిక రాయపురంలోని స్టాన్లీ ప్రభుత్వాసుపత్రి ప్రాంగణంలో రూ.147 కోట్లతో కొత్త భవనాలు నిర్మించనున్నట్లు ఆరోగ్య శాఖ అధికారులు తెలిపారు. రూ.112 కోట్లతో మల్టీ స్పెషాలిటీ చికిత్సా విభాగం, పిల్లల సంక్షేమ విభాగం వెనుక వైపు ఉన్న ఖాళీ స్థలంలో రూ.22 కోట్లతో నర్సుల హాస్టల్, రూ.13 కోట్లతో నర్సింగ్ స్కూల్ నిర్మించనున్నారు.

రంజాన్ తోఫా వితరణ

వేలూరు, మార్చి 16: రంజాన్ ఉపవాస దీక్షలను పురస్కరించుకుని ముస్లింలకు ఆహార వస్తువులను పుదియ నీతి కట్చి అధ్యక్షుడు ఏసీ షణ్ముగం అందజేశారు. రంజాన్ దీక్షలు ఈ నెల 11వ తేది నుంచి ప్రారంభమైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో, స్థానిక సైదాపేట, కొనవట్టమ్, టోల్‌గేట్ తదితర ప్రాంతాల్లో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న ఏసీ షణ్ముగం, ఆయా ప్రాంతాల్లో రంజాన్ దీక్షలో ఉన్న ముస్లింలకు ఆహార పదార్థాలు అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నేతలు, నిర్వాహకులు పాల్గొన్నారు.

ఎరువుల ఫ్యాక్టరీని మూసివేయాలని ఎన్నూరులో 33 గ్రామాల జాలర్ల ధర్నా

చెన్నై, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): గత డిసెంబర్ 26న ఎన్నూరు తీరంలో అమ్మోనియా గ్యాస్ లీక్‌కు కారణమైన పెరియకుప్పంలోని ప్రైవేటు ఎరువుల కర్మాగారాన్ని మూసివేయాలని కోరుతూ 33 గ్రామాలకు చెందిన జాలర్లు నిర్వహిస్తున్న ఆందోళన శనివారం 81వ రోజుకు చేరింది. శనివారం ఉదయం జాలర్లు వారి కుటుంబ సభ్యులు మానవహారం నిర్మించారు. రాస్తారోకో జరిపారు. ఆ సందర్భంగా ఎన్నూరు పెరియకుప్పం తదితర ప్రాంతాల్లో దుకాణాలన్నీ మూసివేసి బంద్ పాటించారు.

ఏనుగు దాడిలో యువకుడి మృతి

పెరంబూర్, మార్చి 16: ఏనుగు దాడిలో యువకుడు మృతి చెందాడు. నీలగిరి జిల్లా నూండి ప్రాంతంలో గురువారం సాయంత్రం నడిచి వెళుతున్న ప్రశాంత్‌పై ఏనుగు దాడిచేసింది. దాన్నుంచి తప్పించుకొనే యత్నంలో ప్రశాంత్ సమీపంలోని కాలువలోకి దూకాడు. గాయపడిన ప్రశాంత్‌ను చుట్టుపక్కల వారు గూడలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం ఊటీ వైద్యకళాశాల ఆసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్సలు ఫలించక శనివారం ఉదయం మృతి చెందాడని అటవీ శాఖ అధికారులు తెలిపారు.

తిరుపతి వెళ్లే మెమో రైళ్లు పాక్షిక రద్దు

పెరంబూర్, మార్చి 16: స్థానిక మూర్ మార్కెట్ కాంప్లెక్స్, విల్లుపురం, అరక్కోణం నుంచి తిరుపతి వెళ్లే మెమో సబర్బన్ రైళ్లు ఆది, సోమవారాలు (ఈనెల 17, 18 తేదీలు) పాక్షికంగా రద్దు చేసినట్లు దక్షిణ రైల్వే తెలిపింది.

● నెం.06727 మూర్ మార్కెట్ కాంప్లెక్స్ నుంచి ఉదయం 9.50 గంటలకు బయల్దేరే మెమో ఎక్స్‌ప్రెస్ తిరుపతికి బదులుగా రేణిగుంట వరకు మాత్రమే నడుస్తుంది. అలాగే, నెం.06728 తిరుపతి నుంచి మధ్యాహ్నం 1.35 గంటలకు మూర్ మార్కెట్ కాంప్లెక్స్‌కు బయల్దేరే మెమో ఎక్స్‌ప్రెస్ తిరుపతికి బదులుగా రేణిగుంట నుంచి బయల్దేరుతుంది.

● నెం.16854 విల్లుపురం నుంచి ఉదయం 5.35 గంటలకు తిరుపతికి వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైలు తిరుపతికి బదులుగా కాట్పాడి వరకు మాత్రమే నడుస్తుంది. అలాగే, నెం.16853 తిరుపతి నుంచి మధ్యాహ్నం 1.40 గంటలకు విల్లుపురం బయల్దేరే ఎక్స్‌ప్రెస్ రైలు తిరుపతికి బదులుగా కాట్పాడి నుంచి బయల్దేరుతుంది.

● నెం.06753 అరక్కోణం నుంచి ఉదయం 9.15 గంటలకు తిరుపతికి బయల్దేరే మెమో ఎక్స్‌ప్రెస్ తిరుపతికి బదులుగా రేణిగుంట వరకు మాత్రమే నడుస్తుంది. అలాగే, నెం.06754 తిరుపతి నుంచి మధ్యాహ్నం 3.45 గంటలకు అరక్కోణం బయల్దేరే మెమో ఎక్స్‌ప్రెస్ రైలు తిరుపతికి బదులుగా రేణిగుంట నుంచి బయల్దేరుతుందని అధికారులు తెలిపారు.

రూ.15 లక్షల హవాలా నగదు స్వాధీనం

పెరంబూర్, మార్చి 16: స్థానిక ఎలిఫెంట్ గేట్ సమీపంలో వాహన తనిఖీలు చేపట్టిన పోలీసులు, రూ.15 లక్షల హవాలా నగదు స్వాధీనం చేసుకున్నారు. సెంట్రల్ సమీపంలో బ్లూస్టార్ హోటల్ వద్ద శుక్రవారం రాత్రి పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో అటుగా ద్విచక్రవాహనంపై వచ్చిన యువకుడిని తనిఖీ చేయగా, అతని వద్ద ఉన్న బ్యాగులో రూ.15 లక్షల నగదు గుర్తించారు. ఈ నగదుకు సంబంధించి అతని వద్ద ఎలాంటి దస్తావేజులు లేకపోవడంతో పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అతను పురుషవాక్కం కందప్పవీధికి చెందిన మహమ్మద్ ముస్తాక్ అని, ఓ ఏజెంట్ వద్ద పనిచేస్తున్నట్లు తెలిసింది. ఈ నగదుకు సంబంధించి ఎలాంటి పత్రాలు లేకపోవడంతో హవాలా నగదుగా భావిస్తున్న పోలీసులు, ముస్తాక్‌ను విచారిస్తున్నారు.



లోక్‌సభ ఎన్నికల్లో నిఘా, ఫ్లైయింగ్ స్క్వాడ్, వీడియో నిఘా కమిటీ అధికారుల కోసం సిద్ధం చేస్తున్న వాహనాలను పరిశీలిస్తున్న చెన్నై జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ జే. రాధాకృష్ణన్

రేపటినుంచి ఆన్‌లైన్‌లో ఐపీఎల్ టిక్కెట్ల విక్రయం

పెరంబూర్, మార్చి 16: ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) పోటీలు ఈ నెల 22వ తేది నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ పోటీల్లో తొలి మ్యాచ్‌కు చేపాక్కం స్టేడియం ఆతిథ్యమివ్వనుంది. ఆ రోజున పోటీ ప్రారంభోత్సవం సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. తొలి మ్యాచ్ 22వ తేది రాత్రి 7.30 గంటలకు చెన్నై సూపర్ కింగ్స్ - రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు మధ్య జరగనుంది. ఈ మ్యాచ్ టిక్కెట్ల విక్రయం ఈ నెల 18వ తేది ఉదయం 9.30 గంటలకు ఆన్‌లైన్‌లో ప్రారంభం కానుంది. స్టేడియంలోని సీ,డీ,ఈ లోయర్ టిక్కెట్టు ధర రూ.1,700, ఐ,జే,కే అప్పర్ రూ.4,000, ఐ,జే,కే లోయర్ రూ.4,500, సీ,డీ,ఈ అప్పర్ రూ.4,000, కేఎంకే టెర్రస్ టిక్కెట్టు ధర రూ.7.500గా నిర్ణయించారు. ఆన్‌లైన్‌లో ఒకరు రెండు టిక్కెట్లు మాత్రమే కొనుగోలు చేయవచ్చని, పేటీఎం, చెన్నై సూపర్ కింగ్స్ వెబ్‌సైట్ ద్వారా టిక్కెట్లు కొనుగోలు చేయవచ్చని సీఎస్‌కే చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కేఎస్ విశ్వనాథన్ చెప్పారు.

ఎన్నిసార్లు పర్యటించినా ఫలితం శూన్యం
● రాష్ట్ర ప్రజల ఆగ్రహానికి గురికానున్న మోదీ
● టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వపెరుందగై

పెరంబూర్, మార్చి 16: ప్రధాని మోదీ రాష్ట్రానికి ఎన్నిసార్లు వచ్చినా ఫలితం శూన్యమని, రాష్ట్ర ప్రజల ఆగ్రహానికి గురికాక తప్పదని తమిళనాడు కాంగ్రెస్ కమిటీ (టీఎన్‌సీసీ) అధ్యక్షుడు సెల్వపెరుందగై తెలిపారు. రాయపేటలోని టీఎన్‌సీసీ ప్రధాన కార్యాలయం సత్యమూర్తి భవన్‌లో శనివా రం సెల్వపెరుందగై, దక్షిణ చెన్నై మధ్య జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు ఎస్.ఉమ సమక్షంలో తమిళనాడు ఐక్య జనతాదళ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్.జితేంద్రబాబు, శ్రీమాల సహా పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారిని సాదరంగా పార్టీలోకి ఆహ్వానించిన సెల్వపెరుందగై విలేకరులతో మాట్లాడుతూ... రాష్ట్రం నుంచి డీఎంకే - కాంగ్రెస్‌ను వెళ్లగొట్టాలని మోదీ ప్రకటించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. తమిళ భాష మాట్లాడలేనందుకు బాధగా ఉందంటూ మోదీ మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రాచీన భాష హోదా కలిగిన తమిళ భాషాభివృద్ధికి 2017-20 వరకు కేంద్ర ప్రభుత్వం రూ.12.31 కోట్లు మాత్రమే కేటాయించిందని తెలిపారు. అదే సమయంలో 24,000 మంది మాత్రమే మాట్లాడుతున్న సంస్కృతం భాషాభివృద్ధికి రూ.643.84 కోట్లు కేటాయించారని తెలిపారు. ప్రస్తుతం లోక్‌సభ ఎన్నికల సందర్భంగా ఓట్ల కోసం రాష్ట్రానికి వస్తున్న మోదీ, తమిళ భాషపై అమితమైన ప్రేమ చూపుతున్నారని, ఆయన కపట నాటకాలను రాష్ట్రప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరన్నారు.

85 ఏళ్లు నిండిన వారు ఇంటి నుంచే ఓటు
● రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి సత్యప్రదసాహు

పెరంబూర్, మార్చి 16: రాష్ట్రంలో 85 ఏళ్ల పైబడిన వారు ఇంటి నుంచే ఓటు హక్కు వినియోగించుకొనేలా చర్యలు చేపట్టినట్లు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి సత్యప్రదసాహు తెలిపారు. నగరంలో ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ... లోక్‌సభ ఎన్నికల నోటిఫికేషన్ శనివారం మధ్యాహ్నం 3 గంటలకు కేంద్ర ఎన్నికల కమిషనర్ రాజీవ్‌కుమార్ ప్రకటించినప్పటి నుంచే ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిందన్నారు. రాష్ట్రంలో ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. లోక్‌సభ ఎన్నికలతో పాటు రాష్ట్రంలోని విలవంగోడు శాసనసభ ఉపఎన్నిక మాత్రమే జరుగుతుందన్నారు. ఎన్నికల్లో నగదు బట్వాడాపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. డిజిటల్ నగదు పరివర్తనలపై ప్రత్యేక నిఘా వేశామని తెలిపారు. ప్రజలు కూడా ఎన్నికలు సజావుగా సాగేందుకు సహకరించాలని, నగదు బట్వాడాపై తమకు ఫిర్యాదు చేయాలని సత్యప్రదసాహు విజ్ఞప్తి చేశారు.

ఎన్నికలకు ఎన్ఎంఎం దూరం
నిరసనగా కార్యదర్శి పదవికి రాజీనామా



డాక్టర్ అనుషా రవి

చెన్నై, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): మక్కల్ నీది మయ్యం కార్యదర్శి డాక్టర్ అనుషా రవి తన పదవికి రాజీనామా చేశారు. ఆ మేరకు శనివారం మధ్యాహ్నం రాజీనామా లేఖను పార్టీ అధ్యక్షుడు కమలహాసన్‌కు పంపారు. లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ పోటీ చేయకపోవడాన్ని నిరసిస్తూ తాను ఈ నిర్ణయం తీసుకున్నట్లు అనుషా పేర్కొన్నారు. మూడేళ్లపాటు పార్టీ పదవులిచ్చి ప్రోత్సహించినందుకు కమల్‌కు ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నానని ఆమె తెలిపారు.

● ఎన్నికల వ్యయం దాఖలు చేయని...

27 మంది అభ్యర్థులు అనర్హులుగా ప్రకటన

పెరంబూర్, మార్చి 16: రాష్ట్రంలో గత ఎన్నికల్లో పోటీ చేసి ఎన్నికల వ్యయం దాఖలు చేయని 27 మంది అభ్యర్థులను అనర్హులుగా ప్రకటించారు. లోక్‌సభ, శాసనసభ ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులకు నిర్ణయించిన వ్యయాన్ని మాత్రమే ఖర్చు చేయాల్సి ఉంది. ఎన్నికలు ముగిసిన అనంతరం సదరు అభ్యర్థులు తాము ఖర్చుపెట్టిన వివరాలను ఎన్నికల సంఘానికి సమర్పించాల్సి ఉంది. అలా సమర్పించని అభ్యర్థులపై ఈసీ చర్యలు చేపడుతోంది. ఈ నేపథ్యంలో, గత ఎన్నికల్లో పోటీచేసి ఖర్చుల వివరాలు దాఖలు చేయని 27 మంది అభ్యర్థుల జాబితాను రాష్ట్ర ఎన్నికల సంఘం కేంద్ర ఎన్నికల సంఘానికి అందజేసింది. అలాగే, ఈ అభ్యర్థులు మరే ప్రాంతాలోనైనా నామినేషన్ వేసేందుకు వస్తే తిరస్కరించాలని ఈసీ సూచించింది.

600వ రోజుకు చేరిన 'పరందూర్' నిరసన



పంట పొలాల్లో దిగి ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

పెరంబూర్, మార్చి 16: పరందూర్ విమానాశ్రయ ఏర్పాటుకు పంట పొలాలు స్వాధీనం చేసుకోవడాన్ని నిరసిస్తూ రైతులు, ప్రజలు పొలాల్లో దిగి 600వ రోజు ఆందోళనలు చేపట్టారు. కాంచీపురం సమీపం పరందూర్, ఏకనాపురం, నెల్వాయ్, నాగపట్టణం సహా 14 గ్రామాల పరిధిలోని 4,800 ఎకరాలల్లో రెండో విమానాశ్రయం ఏర్పాటుకానుంది. ఈ విమానాశ్రయ ప్రకటన వెలువడినప్పటి నుంచి ఏకనాపురం, పరందూర్, నెల్వాయ్ ప్రాంతానికి చెందిన ప్రజలు ప్రతిరోజు రాత్రి సమయాల్లో ఆందోళనలు, నిరాహార దీక్షలు, ర్యాలీలు, రాస్తారోకోలు చేపట్టి విమానాశ్రయ ఏర్పాటు విరమించుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో, ఇటీవల భూసేకరణకు సంబంధించిన ప్రకటన ప్రభుత్వం జారీ చేయడంతో గ్రామస్తులు ఆందోళనలు తీవ్రతరం చేశారు. శనివారం 600వ రోజుగా ఏకనాపురం ప్రాంతంలోని అమ్మన్ ఆలయం నుంచి ర్యాలీగా బయల్దేరిన ప్రజలు తమ పంట పొలాల్లో దిగి ఆందోళన చేపట్టారు. ఈ ఆందోళన నేపథ్యంలో, ఆ ప్రాంతంలో పోలీసులకు భారీగా మోహరింప చేయడంత పాటు 108 అంబులెన్స్‌లను కూడా సిద్ధంగా ఉంచారు. కాగా, నేటినుంచి రాత్రి సమయాల ఆందోళనలు చేపట్టకుండా, న్యాయపరమైన పోరాటం సాగించనున్నట్లు ఉద్యమ కార్యాచరణ కమిటీ ఆర్గనైజర్ సుబ్రమణి తెలిపారు. అలాగే, తమ డిమాండ్ అంగీకరించిన పక్షంలో లోక్‌సభ ఎన్నికలను బహిష్కరిస్తామని ఆయన హెచ్చరించారు.

రీల్స్ మోజులో దుస్సాహసం
చెరువులో మంటల్లో దూకిన యువకులు



చెన్నై, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): తూత్తుకుడి జిల్లా సాత్తాన్‌కుళం వద్ద రీల్స్ మోజులో రంజిత్ బాలా అనే యూట్యూబర్, అతడి స్నేహితులు కలిసి ఓ చెరువులో పెట్రోలు పోసి మంటపెట్టి ఆ మంటల్లో అందరూ వరుసగా దూకి, ఆ దృశ్యాలను వీడియో తీసి సోషల్ మీడియాలో వెలువరించారు. ఆ వీడియో ప్రస్తుతం నెటిజన్లకు గగుర్పాటు కలిగిస్తోంది. చెరువును ఆనుకుని ఉన్న ఓ గోడపై నిలిచి రంజిత్‌బాలా, అతడి స్నేహితులో చెరువునీటిపై పెట్రోలు పోసి నిప్పంటించారు. ఆ మంటల నడుమ అందరూ వరుసగా దూకారు. ఆ సందర్భంగా ఒకరిద్దరి వంటిపై నిప్పుమంటలు చెలరేగాయి. కాని వారికి ఎలాంటి ప్రాణాపాయం జరగలేదు.

SUNDAY SPECIAL

చవులూరించే రంజాన్ బజార్

ప్యారీస్, మార్చి 16: పవిత్ర రంజాన్ అంటే కేవలం ఉపవాసాలు, నమాజులు మాత్రమే కాదు, నోరూరించే వంటకాలు కూడా. రకరకాల జిలేబి, జిబాన్ సూప్, భైరా రోటి, హలీం, సీక్ రోటి, కోడి కూర వేపుడు, చికెన్ 65, గార్లిక్ చిల్లీ చికెన్, మటన్ కోఫ్తా, ఎవర్‌గ్రీన్ కర్రీ, ఎగ్ మసాలా, పీస్ బిర్యానీ తదితర నోరూరించే వంటకాలకు ఉత్తర చెన్నైలోని హార్బర్ నియోజకవర్గ పరిధిలో అంగప్పనాయకన్ వీధి కేరాఫ్ అడ్రస్. ఇఫ్తార్ ప్రారంభమయ్యేటప్పటి నుంచి సహార్ మొదలయ్యే వరకు నోరూరించే వంటకాలు అందుబాటులో ఉండే ప్రాంతం. సాయంత్రం 5 గంటలకు మొదలయ్యే రద్దీ అర్ధరాత్రి 12 గంటల వరకు కొనసాగుతుంది. ఈ బజార్‌కు అన్ని వర్గాలకు చెందిన ప్రజలు పెద్దసంఖ్యలో తరలివస్తుంటారు. రంజాన్ కోసం ప్రత్యేకంగా తయారుచేసిన వంటకాలను తృప్తిగా ఆరగిస్తుంటారు. వెజ్, నాన్‌వెజ్ సమోసాలు, వడలు, బజ్జీలు, మటన్ టిక్కీలు, కారం బోండా, గ్రిల్డ్ చికెన్, లాలీపాప్, కట్ లెట్స్, రకరకాల మిల్క్ షేక్స్‌కు కు ఫిదా అయిపోతారు. ఇక ఈ బజార్ తినుబండారాలకే కాదు అత్తరు, వివిధ డిజైన్ల టోపీలు, బుర్ఖాలు, మగువలను ఆకట్టుకొనే హైదరాబాదీ గాజులు, సంప్రదాయ చీరలకూ ప్రసిద్ధే. రంజాన్ ఉపవాస దీక్షలు ప్రారంభం రోజు నుంచి దీక్ష విరమించే రోజు వరకు అంగప్పన్ నాయకన్ వీధి, మన్నడి వీధి, తంబుచెట్టి వీధి, లింగుచెట్టి వీధి ప్రాంతాలు కొనుగోలుదారులతో కళకళలాడుతుంటాయి.



బజ్జీ వెరైటీలు

కొనుగోలు చేస్తున్న ప్రజలు

విక్రయాలకు సిద్ధంగా ఉన్న చిరు తిండ్లు

మిల్క్ షేక్

కొనుగోలుదారులతో కళకళలాడుతున్న అంగప్పనాయకన్ వీధి

ఆకట్టుకుంటున్న కట్ లెట్స్

వెజిటెబుల్ కట్ లెట్స్

మటన్ సమోసాలు

ముగిసిన 'హెర్నియా కార్నివాల్' సదస్సు

చెన్నై, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): జెమ్ ఆసుపత్రి ఆధ్వర్యంలో 'అసోసియేషన్ ఆఫ్ మినిమల్ యాక్సెస్ సర్జన్స్ ఆఫ్ ఇండియా' (ఏఎంఏఎస్ఐ) సహకారంతో నగరంలో రెండు రోజుల పాటు 'హెర్నియా కార్నివాల్' పేరుతో అంతర్జాతీయ సదస్సు జరిగింది. శుక్ర, శనివారాల్లో జరిగిన ఈ సదస్సుకు జెమ్ ఆసుపత్రి వ్యవస్థాపక ఛైర్మన్ డాక్టర్ సి.పళనివేలు, ఏఎంఏఎస్ఐ అధ్యక్షుడు డాక్టర్ సీజే వర్గీస్ డాక్టర్ కల్పేష్ జాని, డాక్టర్ దెబోర్షి శర్మ తదితరులు హాజరయ్యారు. 700 మందికి పైగా అంతర్జాతీయ ప్రతినిధులు హాజరై తమ అమూల్యమైన అభిప్రాయాలను సదస్సులో పంచుకున్నారు.



సదస్సులో ప్రముఖ వైద్యులు

డబ్ల్యూటీఎఫ్‌లో ఘనంగా మహిళా దినోత్సవం

ప్యారీస్, మార్చి 16: ప్రపంచ తెలుగు సమాఖ్య (డబ్ల్యూటీఎఫ్) ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాలు ఘనంగా జరిగాయి. అన్నాసాలై సమీపంలోని పీవీ చెరియన్ రోడ్డులో ఉన్న కేసీటీ కార్యాలయం ప్రాంగణంలో డబ్ల్యూటీఎఫ్ అధ్యక్షురాలు డాక్టర్ వీఎల్ ఇందిరా దత్ సారథ్యంలో జరిగిన ఈ వేడుకలు ప్రార్థనాగీతంతో ప్రారంభమయ్యాయి. ఇందిరాదత్ తన అధ్యక్షోపన్యాసంలో... స్త్రీ శక్తి గొప్పదని, మహిళలు ప్రస్తుతం ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకొని అన్ని రంగాల్లో రాణిస్తున్నారన్నారు. ఇన్ఫోసిస్ సుధా మూర్తి రాజ్యసభ సభ్యురాలు కావడం మహిళా దినోత్సవం కానుకగా భావిస్తున్నట్లు తెలిపారు. అనంతరం సంగీత సాహితి చంద్ర డాక్టర్ వీవీ సాయికృష్ణ యాచేంద్ర సంగీత గేయధార శ్రోతలను మైమరిపించింది. ప్రాశ్నికులుగా డాక్టర్ లలిత, డాక్టర్ టి.మోహనశ్రీ, కమలాకర రాజేశ్వరి, లావణ్య గాదె, గోపిక పూర్ణిమ, ఐకాస్ టెక్నాలజీస్ డైరెక్టర్ సి.శోభారాజ తదితరులు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు కవితా దత్, కార్యదర్శి శ్రీ లక్ష్మీ మోహనరావు కార్యక్రమాన్ని నిర్వహించగా, ఊరా శశికళ వ్యాఖ్యాతగా వ్యవహరించారు. తెలుగు ప్రముఖులు జే.ఎం.నాయుడు, ఆచార్య కాసల నాగభూషణం, గోటేటి వెంకటేశ్వరరావు, బేతిరెడ్డి శ్రీనివాస్, ఊరా ఆంజనేయులు, డబ్ల్యూటీఎఫ్ నెల్లూరు జిల్లా అధ్యక్షుడు బలరామనాయుడు సహా పలువురు పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా అతిథులు, ప్రముఖులు, ప్రాశ్నికులను జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు.



సాయికృష్ణ యాచేంద్ర, శోభారాజును సత్కరిస్తున్న వీఎల్ ఇందిరా దత్

కావేరి హాస్పిటల్ ఆధ్వర్యంలో

నవ్వుల యోగా చికిత్స



నవ్వుల యోగా చికిత్స గురించి వివరిస్తున్న మనోహర్ బోకాడియా

చెన్నై, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆళ్వార్‌పేటలోని కావేరి హాస్పిటల్‌లో ప్రపంచ మూత్రాశయ దినం సందర్భంగా నవ్వుల యోగా చికిత్సను నిర్వహించారు. నగరానికి చెందిన లాఫర్ యోగా చెన్నై ఇంటర్నేషనల్ వ్యవస్థాపక అధ్యక్షుడు మనోహర్ బోకాడియా ఈ చికిత్సను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారందరూ నవ్వుల యోగాభ్యాసం చేస్తూ ఒత్తిళ్లనుంచి బయటపడ్డారు. మూత్రపిండాలు చెడిపోవడానికి మానసిక ఒత్తిడి, మధుమేహం ప్రధాన కారణాలని, నవ్వుతూ చెలాకీగా ఉంటే ఒత్తిళ్లు తగ్గిపోతాయని మనోహర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కావేరి హాస్పిటల్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ అయ్యప్పన్ పొన్నుసామి, చీఫ్ నెఫ్రాలజిస్ట్ ఆర్.బాలసుబ్రమణ్యం, నెఫ్రాలజిస్ట్ బాలాజీకృష్ణన్ తదితరులు పాల్గొన్నారు.

40 స్థానాల్లో అన్నాడీఎంకేదే విజయం

● ఎంజీఆర్ యువజన విభాగం సంయుక్త కార్యదర్శి డాక్టర్ సునీల్

పెరంబూర్, మార్చి 16: లోక్‌సభ ఎన్నికల్లో తమిళనాడు, పుదుచ్చేరి రాష్ట్రాల్లోని 40 స్థానాల్లో అన్నాడీఎంకే విజయం సాధిస్తుందని ఆ పార్టీ అనుబంధ సంఘం ఎంజీఆర్ యువజన విభాగం సంయుక్త కార్యదర్శి డాక్టర్ సునీల్ ధీమా వ్యక్తం చేశారు. అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి నేతృత్వంలో లోక్‌సభ ఎన్నికల్లో ఘన విజయం సాధించాలని సునీల్ రాష్ట్రంలోని ప్రధాన ఆలయాలను సందర్శించి పూజలు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో, రెండాకుల గుర్తు దక్కనివ్వకుండా కొందరు ద్రోహులు వేసిన పిటిషన్‌ను ఢిల్లీ హైకోర్టు శనివారం తోసిపుచ్చింది. ఇందుకు హర్షం తెలిపిన సునీల్, శ్రీరంగం రంగనాథస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రజలకు లడ్డూలను పంచిపెట్టారు.



శ్రీరంగం రంగనాథస్వామి ఆలయంలో పూజల అనంతరం ప్రజలకు లడ్డూలు పంచిపెడుతున్న డాక్టర్ సునీల్

అశోక్ సెల్వన్ - అవంతిక మిశ్రా జంటగా 'ఎమక్కుతొళిల్ రొమాన్స్'

అశోక్ సెల్వన్ - అవంతిక మిశ్రా జంటగా నటించిన చిత్రం 'ఎమక్కుతొళిల్ రొమాన్స్'. ఈ మూవీ ఫస్ట్‌లుక్‌ను హీరోలు విజయ్ సేతుపతి, ఆర్య శుక్రవారం విడుదల చేశారు. టి క్రియేషన్స్ బ్యానరుపై నిర్మాత ఎం.తిరుమలై నిర్మాణ సారథ్యంలో డెబ్యూ డైరెక్టర్ బాలాజీ కేశవన్ రొమాంటిక్ కామెడీగా తెరకెక్కించారు. విభిన్నమైన కథలను ఎంచుకుని విజయవంతంగా దూసుకెళ్తున్న అశోక్ సెల్వన్ ఈ చిత్రంలో అవంతిక మిశ్రాతో రొమాన్స్ చేయనున్నారు. ఒక యువకుడి ప్రేమ, దానివల్ల తలెత్తే సమస్యలను, అతనికి సహకరించే కుటుంబం, స్నేహితులు ఇలా స్టన్నింగ్ కామెడీగా చిత్రాన్ని రూపొందించారు. ఇందులో సీనియర్ నటి ఊర్వశి కీలక పాత్రను పోషించగా, అళగం పెరుమాళ్, బక్స్, ఎంఎస్ భాస్కర్, విజయ్ వరదరాజ్, బడవా గోపి తదితరులు నటించారు. నివాస్ కె.ప్రసన్న సంగీత స్వరాలు సమకూర్చిన ఈ చిత్రం షూటింగ్ పూర్తి చేసుకుని పోస్ట్‌ప్రొడక్షన్ నిర్మాణ పనులను జరుపుకుంటోంది. టీజర్, ట్రైలర్, ఆడియో విడుదల తేదీలను త్వరలోనే వెల్లడించనున్నారు.



'ఎమక్కుతొళిల్ రొమాన్స్' ఫస్ట్‌లుక్

చిత్రజ్యోతి



సినీ కెరీర్‌లో 'అళగి' సమ్‌థింగ్ స్పెషల్

● నందితాదాస్

● 29న రీ రిలీజ్

తన సినీ కెరీర్‌లో తంగర్ బచ్చాన్ దర్శకత్వంలో వచ్చిన సూపర్ హిట్ చిత్రం 'అళగి' సమ్‌థింగ్ స్పెషల్ అని హీరోయిన్ నందితాదాస్ చెప్పారు. ఈ సినిమాను పలుమార్లు చూశానని, ఎన్నిసార్లు చూసినా ప్రత్యేక అనుభూతికి లోనుచేస్తూనే ఉంటుందన్నారు. ఆమె నగరంలో విలేకరులతో మాట్లాడుతూ... "అళగి' 2002 సంక్రాంతికి విడుదలైంది. పార్తిబన్ హీరో. దర్శకుడు తంగర్ బచ్చాన్ నన్ను సంప్రదించి స్టోరీ వినిపించారు. అందులో ధనలక్ష్మి పాత్రలోని అమాయకత్వం, ప్రేమ, భావోద్వేగం, జీవితంలో కోల్పోయిన ప్రేమను తిరిగి పొందిన సంతోషం, ఆనందం, మనసుకి దగ్గరైన, ఇష్టపడిన వ్యక్తిని విడిపోవడం ఇలా ప్రతి సన్నివేశం ఓ ప్రత్యేకత. అందుకే నా సినీ కెరీర్‌లో సమ్‌థింగ్ స్పెషల్ మూవీగా నిలిచింది. 22 యేళ్ల తర్వాత వెనక్కి చూసుకుంటే ఆ పాత్ర ఇంకా సజీవంగా ఉన్నట్టు అనిపిస్తుంది. రాష్ట్రంలోని దక్షిణాది ప్రజలకే కాదు విదేశాల్లో నివసిస్తున్న తమిళులకు కూడా ధనలక్ష్మి పాత్ర బాగా కనెక్ట్ అయింది. 'ఇసైజ్ఞాని' ఇళయరాజా స్వరపరిచిన 'పాట్టు సొల్లి.. పాడ సొల్లి' అనే పాట నా ఫేవరేట్ ఆల్బం. నా హృదయానికి చాలా దగ్గరైన పాట. మళ్లీ తంగర్ బచ్చాన్ దర్శకత్వంలో నటించే అవకాశమొస్తే, ఎలాంటి పరిస్థితుల్లో ఉన్నప్పటికీ వదులుకోను. మానవ భావోద్వేగాలను దృశ్యంగా మార్చి, ప్రేక్షకుల హృదయాల్లో గాఢమైన ముద్ర వేయగల ప్రతిభావంతుడైన దర్శకుడు' అని పేర్కొన్నారు. ఈ చిత్రాన్ని కొత్త టెక్నాలజీతో ఈ నెల 29వ తేదీన నిర్మాత ఉదయగీత సినీ క్రియేషన్స్ అధినేత ఉదయకుమార్ రీ రిలీజ్ చేయనున్నారు.

ప్రతీకార కోణాలను తెరపై ఆవిష్కరించే 'కంకణం'



'కంకణం'లో ఓ దృశ్యం

పగ, ప్రతీకారంలోని వివిధ కోణాలను వెండితెరపై ఆవిష్కరించే చిత్రంగా 'కంకణం' తెరకెక్కుతోంది. ఇటవల ఘన విజయం సాధించిన 'మంజుమల్ బాయిస్' చిత్రంలో నటించిన అడ్రస్ కార్తీక్ ఇందులో ముఖ్య పాత్రను పోషిస్తున్నారు. దర్శకుడు మనోబాలా, విజయ్ టీవీ రామర్, సేతుపతి జయచంద్రన్, 'కయల్' మణి, 'రాక్షసన్' యాజర్, అర్చనా మారియప్పన్, శ్రీమహేష్, సిరంజ్ కేజీ తదితరులు ఇతర పాత్రలను పోషించారు. హీరోయిన్లుగా అశ్విని చంద్రశేఖర్, ప్రణా నటించారు. పరుత్తివీరన్ ఫేం శరవణన్ ఈ చిత్రంలో పోలీస్ అధికారిగా నటించారు. గతంలో పలు లఘు చిత్రాలను తెరకెక్కించి అవార్డులను దక్కించుకున్న ఏ.ఇసైయరసన్ దర్శకత్వం వహించారు. జీఏ శివసుందర్ ఛాయాగ్రహణం అందించిన ఈ చిత్రానికి సెల్వ సంగీతం. ఈ సినిమా గురించి దర్శకుడు వివరిస్తూ, "కంకణం' సినిమా షూటింగ్ 70 రోజుల పాటు జరిగింది. మదురై, మేలూరు, చెన్నై తదితర ప్రాంతాల్లో చిత్రీకరించాం. విలన్ చేతిలో హీరో కుటుంబం, పోలీస్ అధికారి, ఆ గ్రామ ప్రజలు అష్టకష్టాలు పడతారు. ఎన్నో అవమానాలు భరిస్తారు. అన్ని విధాలుగా నష్టపోయిన హీరో, పోలీస్ అధికారి, గ్రామప్రజలు కలిసి విలన్‌పై ఎలా ప్రతికారం తీర్చుకున్నారన్న విషయాన్ని మూడు కోణాల్లో తెరపై చూపించాం. అన్ని వర్గాల ప్రేక్షకులు చూసి ఎంజాయ్ చేసేలా ఈ సినిమా ఉంటుంది' అని వివరించారు. కల్యాణి కె, సిరంజన్ కేజీ సంయుక్తంగా కల్యాణి ఎంటర్‌ప్రైజెస్ బ్యానరుపై నిర్మిస్తున్నారు.

'యాలి' జంతువు నేపథ్యంలో 'ఖజానా'

తమిళ చరిత్రలో అంతరించిపోయిన ఆదిమ జీవి 'యాలి' నేపథ్యంలో 'ఖజానా' పేరుతో ఒక చిత్రం తెరకెక్కుతోంది. షూటింగ్ పూర్తి చేసుకోగా, చెన్నైకు చెందిన గ్రీన్‌స్కార్ వీఎఫ్ఎక్స్ కంపెనీ గత రెండేళ్లుగా వీఎఫ్ఎక్స్ పనుల్లో నిమగ్నమైవుంది. ఈ సినిమా కోసం ప్రపంచస్థాయి వీఎఫ్ఎక్స్, గ్రాఫిక్స్‌ను రూపొందించారు. డైనోసార్‌ను మించిన జంతువుగా 'యాలి'ని చిత్రంలో చూపిస్తున్నారు. ఈ చిత్రాన్ని ప్రపంచ వ్యాప్తంగా ప్రేక్షకులను ఆకర్షించే స్థాయిలో కథ, కథనం, అద్భుతమైన వీఎఫ్ఎక్స్‌లతో రూపొందిస్తున్నారు. 'ఇండియానా జోన్స్' 'నేషనల్ ట్రెజర్' వంటి హాలీవుడ్ అడ్వెంచర్ చిత్రాల తరహాలోనే ఏనుగులు, పులులు, పాములు వంటి జంతువుల అద్భుత సన్నివేశాలతో రూపుదిద్దుకుంటోంది. యాలి జంతువును ఇప్పటివరకు ఆలయాలపై శిల లేదా అచ్చు రూపంలోనే చూడగా ఇప్పుడు వెండితెరపై చూపించనున్నారు. ఈ సినిమా గురించి నిర్మాణ సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ 'గ్లోబల్ కథాంశంతో తెరకెక్కించే చిత్రం నాణ్యతా ప్రమాణాలు కూడా అదే స్థాయిలో ఉండాలన్న పట్టుదలతో ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా, అత్యుత్తమ ప్రమాణాలతో నిర్మిస్తున్నాం. ఈ కొత్త వెంచర్ తప్పకుండా సినీ అభిమానులకు కొత్త అనుభూతిని ఇస్తుంది. కచ్చితంగా మా చిత్రాన్ని ఆదరిస్తారని ఆశిస్తున్నాం' అని పేర్కొన్నారు. యోగిబాబు, ఇనిగో ప్రభాకర్‌లు ప్రధాన పాత్రలను పోషిస్తుండగా, ప్రతాప్‌పోతన్, వేలుప్రభాకరన్, మొట్టై రాజేంద్రన్ తదితరులు ఇతర పాత్రలను పోషించారు. ఫోర్ స్క్వేర్ స్టూడియో నిర్మించే ఈ చిత్రానికి కథ, స్క్రీన్‌ప్లే ప్రభాదిస్ శామ్స్.



'ఖజానా'లో ఓ దృశ్యం